సంపుటి :02 సంచిక :171 పేజీలు :07

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శుక్రవారం 29, ఆగస్టు 2025



## ఇది యూరియా విపత్తి!

ఆ రైతు పత్తి పంటను దక్కించుకునేందుకు రోజులకు రోజులు యూరియా కేంద్రాలు, పీఏసీఎస్‌ల చుట్టూ తిరిగాడు. అయినా.. యూరియా దొరకలేదు. ఒక్క బస్తా అయినా యూరియా దొరకలేదు. దీంతో నిరాశ చెందాడు. విసిగి వేసారి చివరకు వేసిన పంటను కుటుంబ సభ్యులతో కలిసి తొలగిస్తూ ఇలా కనిపించాడు. రైతు పేరు భూక్యా బాలు. ఊరు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఉట్టితండా. ఈ చిత్రం రైతుల దైన్యస్థితికి దర్పణం.

- అక్షరదర్బార్, పర్వతగిరి

## తహసీల్దారు ఇంట అవినీతి పుట్ట



- ఆదాయానికి మించి ఉన్న ఆస్తులపై సోదాలు
- రూ.5 కోట్ల విలువైన స్థిర, చరాస్తుల పత్రాలు స్వాధీనం
- దాడులతో రెవెన్యూశాఖలో ఒక్కసారిగా కలకలం
- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర అధికారుల గుండెల్లో రైళ్లు

06



### ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంచలనం

### ఖిలావరంగల్ తహసీల్దారు నివాసాల్లో ఏసీబీ దాడులు

ఆదాయానికి మించి అక్రమాస్తుల కేసులో తహసీల్దారు అక్రమాలు బయటపడ్డాయి. ఒకటి కాదు రెండు కాదు.. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రైడ్స్‌లో కొన్ని రూ.కోట్ల విలువైన అక్రమాస్తులు బయటపడ్డాయి. కొన్నేళ్లుగా సదరు తహసీల్దారుపై నివురు గప్పిన నిప్పులా అవినీతి ఆరోపణలు ఉండగా, వాటిని పటాపంచలు చేస్తూ.. ఏసీబీ అధికారులు అక్రమ లెక్కలు తేల్చారు. ఏకకాలంలో అనేకచోట్ల దాడులు నిర్వహించి అక్రమాస్తులు, భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ తహసీల్దారు ఇళ్లలో దాడులు నిర్వహించడంతో, ఇలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడు తున్నట్లు తెలుస్తున్నది.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## 3,70,867 మంది ఓటర్లు

- 1986 పోలింగ్ కేంద్రాలు
- గ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితా

02

- అభ్యంతరాలపై 30 వరకు గడువు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వ తేదీ లోగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 3,70,867 మంది ఓటర్లు ఉన్నారని, వారి కోసం 1986 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో సవరణలు, తొలగింపులపై రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

- అక్షర దర్బార్ ప్రతినిధి, హనుమకొండ



## మహదేవపూర్ లో సీక్రెట్ ఇసుక క్వారీ దందా..!

- ఒక్కరోజులోనే సాగిన జీరో దందా
- వే బిల్లు లేకుండానే బజాప్తా ఇసుక రవాణా
- చోద్యంగా చూసిన సంబంధిత యంత్రాంగం
- అంతా మామూళ్లేనంటూ బహిరంగ విమర్శలు

05

ఓ క్వారీ ఓపెన్ అయ్యిందంటూ చెలరేగిన ఇసుక మాఫియా

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక మాఫియా మళ్లీ పంజా విసిరింది. మహదేవపూర్ మండలంలో ఓ ఇసుక కాంట్రాక్టర్, సంబంధిత అధికారులతో కుమ్మక్కై అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాల కారణంగా క్వారీలు మూతపడినప్పటికీ, ప్రత్యేక అనుమతులు లేకుండానే ఈ నెల 25న బెగ్లూర్ క్వారీని తెరిచి, ఎలాంటి వే బిల్లు లేకుండానే లారీల్లో ఇసుకను తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన టీజీఎండీసీ అధికారులు ప్రేక్షక పాత్ర వహించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్న ఈ దందాపై అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- అక్షర దర్బార్, కాటారం



## నకిలీ పాస్ పుస్తకాలతో బ్యాంకులకు టోకరా

- అమాయకమైన రైతులే వీరి టార్గెట్
- లక్షలకు లక్షలు కాజేసిన ముఠా
- కురవిలో వెలుగు చూసిన ఘటన
- ముగ్గురు నిందితుల అరెస్ట్

02



## నకిలీ సర్టిఫికెట్లతో కొలువు

- ప్రభుత్వ ఉపాధ్యాయుడి నిర్వాకం
- విధుల నుంచి తొలగించిన విద్యాశాఖ

05

# యూరియా కోసం ఎమ్మెల్యే ఇల్లు ముట్టడికి యత్నం

## మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైతులు రాస్తారోకో

అక్షరదర్బార్, మహబూబాబాద్: పంటలు వేసి యూరియా వేయడానికి తిరిగి తిరిగి యాష్టకొస్తాంది తప్ప ఎక్కడ యూరియా దొరకడం లేదని, మా గోడు విని యూరియా ఇప్పించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైతులు మహబూబాబాద్– తొర్రూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోనే రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడి యూరియా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి రాస్తారోకో విరమింపచేశారు. అయితే రైతులు రాస్తారోకో విరమించి పక్కనే ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే స్పందించిన పోలీసులు అక్కడికి హుటాహుటిన చేరుకొని గేట్లు మూసి రైతులను వెనక్కి పంపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పంటలు సాగు చేసి నెల రోజులు దాటి పోతోందని, ఇప్పటివరకు ఒక్క బస్తా యూరియా కూడా వేయలేకపోయామని, యూరియా కోసం ప్రతిరోజు సొసైటీ వద్దకు వచ్చి వెళ్తున్నామని, యూరియా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి రైతులకు యూరియా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





# 3,70,867 మంది ఓటర్లు

## 1986 పోలింగ్ కేంద్రాలు



- గ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితా
- ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే 30 వరకు తెలియజేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రదర్శించామని, ఓటర్ల ముసాయిదా జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించిన ఓటర్ల ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీలో ప్రదర్శించిన ఓటర్ల ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల గురించి అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో 210 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, గ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితాను గురువారం ప్రదర్శించామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటి వివరాలతో కూడిన సమాచారాన్ని అందజేయాలన్నారు. ఓటర్ల జాబితాపై గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈనెల 30న మండల స్థాయిలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ పూర్తి చేసి తుది ఓటర్ల జాబితాను వచ్చే నెల రెండవ తేదీన ప్రచురణ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఓటర్లు 3,70,867 ఉన్నారని, 1986 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలతోపాటు మున్సిపల్ పరిధిలో ఓటు ఉన్నవారిని గుర్తించి ఒకే చోట ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని, రెండు చోట్ల ఓట్లు ఉన్న వారిని తొలగించాలని కోరుతూ ఆ జాబితాను బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి, కార్పొరేటర్ డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్ రావు, తదితరులు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్ రావు, ఇండ్ల నాగేశ్వరరావు, నిశాంత్, ప్రభాకర్ రెడ్డి, రజినీకాంత్, ఎండి నేహాల్, శ్యాంసుందర్, సయ్యద్ ఫైజుల్లా, కొట్టె ఏసోబు, మణి తదితరులు పాల్గొన్నారు.



# రేపటి నుంచి శాసనసభ సమావేశాలు

- భద్రతా ఏర్పాట్లు పక్కాగా ఉండాలి..
- సభ్యులు అడిగిన సమాచారం తక్షణం అందజేయాలి
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

అక్షరదర్బార్, హైదరాబాద్: శనివారం నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముందస్తు సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. శనివారం నుంచి తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు. గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలి. గౌరవ సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలి. శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలి. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలి. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం జరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే భారీ వర్షాలు కురిసి కొన్ని రూట్లలో రోడ్లు దెబ్బతిన్నాయి. ట్రాఫిక్ అధికారులు సమన్వయం చేసుకుని గౌరవ సభ్యులు సరైన సమయానికి సభకు చేరుకునే విదంగా సహకరించాలి. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలి, తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయి' అని పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలి. అవసరమైన నోడల్ అధికారులను , లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలి. పెండింగ్ లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలి. తెలంగాణ పోలీసు దేశంలోనే సమర్ధవంతమైనది, మంచి పేరు ఉన్నది. మీ ఆద్వర్యంలో శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగే విదంగా సహకరించాలి 'అని సూచించారు. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు మాట్లాడుతూ..' సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తాం. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అవసరమైన అధికారులను అందుబాటులో ఉంచుతాం. సభా నిర్వాహణకు ఇబ్బందులు లేకుండా, సజావుగా జరిగే విదంగా ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సహకరిస్తాం' అన్నారు.

# నకిలీ పాస్ పుస్తకాలతో బ్యాంకులకు టోకరా

- అమాయకమైన రైతులే వీరి టార్గెట్
- లక్షలకు లక్షలు కాజేసిన ముఠా
- కురవిలో వెలుగు చూసిన ఘటన
- ముగ్గురు నిందితుల అరెస్ట్



అక్షరదర్బార్, మరిపెడ: మహబూబాబాద్ జిల్లా కురవిలో నకిలీ పాస్ పుస్తకాలతో రైతులను మోసం చేసి, బ్యాంకులకు కుచ్చుటోపి పెడుతున్న ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. లోన్ కోసం బ్యాంక్ చుట్టూ తిరిగినా రుణం దొరకని అమాయక రైతులను టార్గెట్ చేసి ఈ ముఠా మోసాలకు పాల్పడింది. రైతులకు ఎక్కువ లోన్ ఇప్పిస్తామని, దీనికి కొంత ఖర్చు అవుతుందని నమ్మించి, ఒక్కో పాస్ పుస్తకానికి రూ. 10,000 వసూలు చేసి, నకిలీ పాస్ పుస్తకాలను సృష్టించారు. కురవి పోలీస్ స్టేషన్‌లో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మోసాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులు మూడ్ బాలాజీ, బానోత్ హరికిషన్, మరియు బానోత్ వర్ధన్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ముఠా కురవి, డోర్నకల్, మహబూబాబాద్‌లోని యూనియన్ బ్యాంకులు, మహబూబాబాద్‌లోని కెనరా బ్యాంకులో మొత్తం రూ. 16.90 లక్షల విలువైన నకిలీ లోన్‌లను ఇప్పించినట్లు తేలింది. వీరు మరిన్ని నకిలీ పాస్ పుస్తకాలతో రూ. 1 కోటి వరకు రుణాలు సృష్టించాలనుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారని డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 23 నకిలీ పాస్ పుస్తకాలు, ఒక ల్యాప్‌టాప్, ఒక కంప్యూటర్, రెండు ప్రింటర్లు, మూడు సెల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో బ్యాంక్ సిబ్బంది ప్రమేయం కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, ఈ కుంభకోణంలో పాల్గొన్న అందరినీ బయటపెట్టాలని పోలీసులను కోరుతున్నారు. పరారీలో ఉన్న మరికొందరు నిందితులను కూడా పట్టుకుంటామని, నకిలీ లోన్‌లు తీసుకున్న వారిని కూడా అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తిరుపతిరావు స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ.

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పూజారి సాంబయ్య అనారోగ్యంతో గురువారం మృతిచెందగా శుక్రవారం భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణ రెడ్డి పూజారి సాంబయ్య భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. కార్యక్రమంలో 3వ వార్డు మాజీ కౌన్సిలర్ పొరండ్ల సంతోష్ , ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్, మాజీ ఎంపీపీ ఒంటెరు రామ్మూర్తి, మాజీ ఎంపీటీసీ కొత్తపెల్లి రవి, డాక్టర్. మడికొండ శీను, బొచ్చు భాస్కర్, ఏకు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాల మండలంలో..

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆంధ్రప్రభ రిపోర్టర్ బుర్ర చక్రపాణి తండ్రి రాజయ్యతో పాటు, నైన్పాక గ్రామానికి చెందిన కట్టెకోళ్ల రాజు నాయనమ్మ లక్ష్మీ, గొడుగు కుమార్ మాతృమూర్తి అయిలు మల్లక్క, రాయరా కుల రమేష్ మాతృమూర్తి సమ్మక్క, వొడితల గ్రామ సీనియర్ నాయకుడు రాసూరి మొగిలి సతీమణి రాసూరి ప్రమీల మృతిచెందగా, వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు.







## కాంగ్రెస్ అసమర్థ పాలన వల్లే

# రైతులకు కష్టాలు

**–మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్**

అక్షర దర్బార్, కేసముద్రం : కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగానే రైతులు తీవ్రమైన కష్టాలు ఎదు ర్కొంటున్నారని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ విమర్శించారు. శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధిం చిన ఓటర్ జాబితాను పరిశీలించి, గల్లంతైన ఓట్లపై ఈ నెల 30న అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కాంగ్రెస్ చేతగాని పాలన వల్లే రైతులు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా బోనస్ అందకపోవడం, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలను అరకొరగా అమలు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంద న్నారు. సబ్సిడీ గ్యాస్, గృహజ్యోతి వంటి పథకాలు అమలు కావడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నేతలు విస్మరించారని విమర్శించారు. రైతులు సాగుకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పొందలేని స్థితి ఏర్పడిందని, యూరియా కోసం రైతులు గంటల తరబడి కార్యాలయాల వద్ద నిలబడటం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు ఐక్యంగా ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చిన ఆయన, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్య ర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. సమావే శంలో మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నీలం దుర్గేశ్, మండల పార్టీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, కముటం శ్రీనివాస్, మోడెం రవిందర్ గౌడ్, సట్ల వెంకన్న, కొండ్రెడ్డి రవిందర్రెడ్డి, ఘనపారపు రమేష్, గుగులోతు వీరు నాయక్, యనమల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# వైన్స్ షాప్ టెండర్లలో గౌడలకు 25% కేటాయించాలి

అక్షరదర్బార్, నల్లబెల్లి : గౌడలకు వైన్స్ షాప్ టెండర్లలో 25 శాతం కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి మండల కార్యదర్శి చీకటి ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 15 శాతం మాత్రమే కేటాయించిందని, అయితే కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో 25 శాతం హామీ ఇచ్చిందని గుర్తుచే శారు. సెప్టెంబర్‌లో జరగనున్న టెండర్లలో మళ్లీ 15 శాతం మాత్రమే ప్రకటించడం గౌడలను మోసం చేయడమేనని ఆయన విమర్శిం చారు. వెంటనే నిబంధనలు మార్చి 25 శాతం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సమితి నాయకులు సామాల దేవేందర్, కస్తూరి రవీందర్, కొలగాని రామారావు, పప్పు రేణుకు మార్, డా.నరేష్ గౌడ్, వైనాల వీరాస్వామి, ముత్యాల రవి గౌడ్, కడియాల క్రాంతికుమార్, ఉప్పుల సంపత్, రాపర్తి సంపత్ గౌడ్, జెట్టి వేణుగోపాల్, గాదం మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రాజేంద్రప్రసాద్ రెడ్డి

# బాలాజీ టెక్నో స్కూల్ లో జాతీయ క్రీడా దినోత్సవం

అక్షర దర్బార్, నర్సంపేట : లక్నేపల్లి బాలాజీ టెక్నో స్కూల్‌లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎన్.సి.సి. 10వ బెటాలియన్ సూచనల మేరకు ఎన్.సి.సి. థర్డ్ ఆఫీసర్ ఎం.డి. రియాజుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ పి. రాజేం ద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించు కుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటామని, క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీలలో విజయం సాధించిన విద్యార్థులు, ఎన్.సి.సి. క్యాడెట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు భవాని చంద్, రవీందర్ రెడ్డి, పార్వతి, వినోద్, గోపి, సతీష్, అరుంధతి, రాజీవ్ తదిత రులు పాల్గొన్నారు.

# పూజారి సాంబయ్య సేవలు మరువలేనివి

## మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళి

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పూజారి సాంబయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని అటవీ శాఖ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ అన్నారు. పూజారి సాంబయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, శుక్రవారం ఆయన పార్థివదే హాన్ని వారు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ సాంబయ్య అకాల మరణం బాధాకరమని, ప్రజాసేవలో ఆయనకున్న అంకి తభావం, కాంగ్రెస్ పార్టీ పట్ల చూపిన విధేయత ఎప్పటికీ మరువలేనిదని తెలిపారు. పూజారి సాంబయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని వారు పేర్కొన్నారు.

# ఎస్సైని కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి ఎస్ఐ గోవర్ధన్ ని శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరికిరత్నం మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఈ సందర్భంగా ఎస్ఐ ని శాల తో సత్కరించి సన్మానించారు.




ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పరికి కోరనేల్ మాదిగ, రవీందర్ మాదిగ అరుణ్ మాదిగ లు పాల్గొన్నారు.



# కౌకొండలో రోడ్లపై నాట్లు

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిపై తీరుపై నిరసన

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలం కౌకొండ గ్రామంలో చిన్న వర్షానికే రోడ్డు బురదమయమైపోవడంతో గ్రామ రోడ్డుపై వరి నాట్లు వేసి డీఎస్పీ, బీఎస్పీ, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే రేవూరి ప్రకా ష్ రెడ్డిపై నిరసన తెలిపారు. వెల్లంపల్లి క్రాస్ నుండి గ్రామానికి వచ్చే 3 కిలోమీటర్ల రోడ్ పనులు రెండు సంవత్సరాలుగా ఆగిపోయాయ ని, గ్రామస్తుల ఆందోళనపై ఎమ్మెల్యే రెండు రోజుల్లో పనులు ప్రారం భిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని నాయకులు ఇనగాల దిలీప్ , మేకల విష్ణు, గోల్కొండ చంటి విమర్శించారు. వర్షాలతో రోడ్డు గుంతలుగా మారి బురదగా మారిందని, వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రహదారి సమస్యను పరిష్కరించక పోతే గ్రామంలో రిలే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.



# బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శికి శుభాకాంక్షలు

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం తహరాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ రవికిరణ్ గౌడ్ భూపాలపల్లి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పరకాల నియోజకవర్గ బీజేపీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు గరిజాల శ్రీరామ్ రెడ్డి, ముత్యాల శ్రీనివాస్ గౌడ్, పరకాల అసెంబ్లీ కన్వీనర్ ములక ప్రసాద్, దామెర మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్, గీసుగొండ మండల అధ్యక్షుడు చొక్కం శ్రీనివాస్, నాయకులు రాజశేఖర్, బత్తుల సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఓట్ల నాడు ఒక మాట.. నాట్ల నాడు మరో మాట..

## కాంగ్రెస్ ప్రభుత్వంది రైతు వ్యతిరేక పాలన

## : కేటీఆర్ సేన భూపాలపల్లి జిల్లా కమిటీ

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఘోరంగా మోసం చేస్తోందని కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు వీసం భరత్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు పిన్నింటి మణిదీప్ ఆరోపించారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో గ్యారంటీ కార్డుల్లో ప్రతి గింజకు రూ.500 బోనస్ అని హామీ ఇచ్చి.. ఇప్పుడు సన్న వడ్లకే పరిమితం చేయడం రైతులకు తీరని అన్యాయం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. సాగునీరు లేక, విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయినా ప్రభుత్వం సహాయం చేయలేదని, కొనుగోలు కేంద్రాలు సరిగా నడపక రైతులను ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు. "డిసెంబర్ 9 నాటికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నిలబెట్టుకోలేదు. బోనస్ విషయంలో కూడా వెనకడుగు వేస్తోంది. ఇది రైతు వ్యతిరేక పాలన" అని విమర్శించారు. తక్షణమే బోనస్ విడుదల చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

# మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ



అక్షరదర్బార్, శాయంపేట : శాయంపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు ఉప్పురాజు తల్లి ఉప్పు సమ్మక్క ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జన్నే మొగిలి, రాయరాకుల మొగిలి మృతురాలి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటికొండ రవి కిరణ్, మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, భూత్ అధ్యక్షులు కదారి చంద్రమౌళి, పార్టీ నాయకులు అనుమండ్ల రమేష్, మోరే రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు అవగాహన సమావేశం

అక్షర దర్బార్, శాయంపేట : గ్రామపంచాయతీ ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు ఈరోజు (30-8-2025) ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఫణిచంద్ర తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.







# క్రీడలతో శారీరక దృఢత్వం

## -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, భూపాలపల్లి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జాతీయ క్రీడా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి గర్వకారణమైన హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని ప్రతి సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. యువత మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా క్రీడల్లో పాల్గొని ప్రతిభను చాటాలని పిలుపునిచ్చిన ఆయన, క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి రఘు, విద్యాశాఖ అధికారి రాజేందర్, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎల్.జైపాల్, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, క్రీడాకారులు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును సద్వినియోగం చేసుకోవాలి

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి-పరకాల మార్గంలో నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. భూపాలపల్లి నుండి మొరంచపల్లి, ఎస్.ఎం.కొత్తపల్లి, ఒడితల, గోపాలపురం, కాకర్లపల్లి, కొడవటంచ గ్రామాల మీదుగా బస్సులో స్వయంగా ప్రజలతో కలిసి ప్రయాణం చేశారు. మార్గమధ్యంలో గ్రామస్తులు శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ప్రజలు బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# నయవంచక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి

## వికలాంగుల సంఘం నాయకుడు పుల్ల మల్లయ్య

అక్షర దర్బార్, చిట్యాల : అర్హులైన వికలాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా ప్రభుత్వాలు మోసం చేశాయని వికలాంగుల సంఘం నాయకుడు పుల్ల మల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇలాంటి పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్లుగా కొత్త పింఛన్లు రాక వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని



పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే సైట్ ఓపెన్ చేసి పింఛన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించండి

## -భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్ : భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ నేరాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేసి కోర్టులకు పంపాలని, ప్రతి పోలీస్ అధికారి క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. మహిళల భద్రత, పిల్లల రక్షణ, సైబర్ నేరాలు, అక్రమ రవాణా, మద్యనిషేధ ఉల్లంఘన, గూండా కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే, పోలీస్ స్టేషన్లు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నేరాలు జరగకుండా ముందుగానే నివారించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా బలోపేతం చేయడం, ఇంటెలిజెన్స్ సేకరణ పెంచడం, కొత్తగా వెలుగులోకి వస్తున్న నేర ధోరణులను గమనించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు పెన్నిధి సీఎంఆర్ఎఫ్

## -మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్



అక్షరదర్బార్, కేసముద్రం : సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధిగా నిలుస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స పొందేందుకు సీఎం సహాయ నిధి ఎంతో దోహదపడుతోంది. పార్టీలకు అతీతంగా, కేవలం అర్హత ఆధారంగానే ఈ నిధులు అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసముద్రం మండలం సబ్‌స్టేషన్‌కు చెందిన భూక్య జ్యోతి కి రూ.26 వేల, గుగులోత్ సునీతకు రూ.1.20 లక్షల, దన్నసరి గ్రామానికి చెందిన వాంకుడోత్ మమతకు రూ.68 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే మురళి నాయక్ అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ, వైద్య సహాయం కోసం సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేసిన నిధులు తాము పొందేలా కృషి చేసిన ఎమ్మెల్యే మురళి నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ అంబటి మహేందర్ రెడ్డి, దస్రు నాయక్, బండారు దయాకర్, యూత్ ప్రెసిడెంట్ బాదావత్ పవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ తప్పదు

అక్షర దర్బార్, శాయంపేట : జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ఉదయశ్రీ ప్రభాకర్ రిటైర్మెంట్ కార్యక్రమం ఎస్వీకెకె ఫంక్షన్ హాల్లో జరిగింది. హెచ్ఎం జనార్ధన్, మాజీ హెచ్ఎంలు వెంకటేశ్వరరావు, అజీముద్దీన్, సంఘ నాయకులు తిరుపతి రెడ్డి, ఫలిత శ్రీహరి, సంజీవరెడ్డి, బాసిరి రాజబాపురావు తదితరులు ఘనంగా సన్మానించారు.



# ఓటర్ లిస్ట్ సరిచూసుకోండి

అక్షర దర్బార్, చిట్యాల : భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముకిరాల మధు వంశీకృష్ణ శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యాలయాలలో అతికించిన ఓటర్ లిస్టులను పరిశీలించాలని కోరారు. ఓట్ల గల్లంతు, డూప్లికేట్, వార్డుల సవరణ లాంటి అంశాలపై అభ్యంతరాలు ఉంటే పంచాయతీ కార్యదర్శులకు, మండల అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఓటర్ లిస్టులను తప్పనిసరిగా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.







# సీక్రెట్ ఇసుక దందా..!

- మహదేవపూర్ లో క్వారీ ఓపెన్ అయ్యిందంటూ చెలరేగిన ఇసుక మాఫియా
- ఒక్కరోజులోనే సాగిన జీరో దందా
- వే బిల్లు లేకుండానే బాజాప్తా ఇసుక రవాణా
- చోద్యం చూసిన యంత్రాంగం
- అంతా 'మామూళ్ళే'నంటూ బహిరంగ విమర్శలు

అక్షరదర్బార్, కాటారం: ప్రకృతి ప్రసాదమైన జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల గోదావరి కేంద్రంగా ఓ ఇసుక కాంట్రాక్టర్ ధ్వజమెత్తాడు. టీజీఎండీసీలో నాకంతా సపరివార సంబంధీకులే అంటూ రాజ్యమేలసాగాడు. ఈ నేపథ్యంలో తనకిష్టమైన సమయంలో తన ఇసుక క్వారీనే ఓపెన్ చేసుకుని తన స్టామినా ఏంటో నిరూపించుకున్నాడు. కాగా అడ్డుపడాల్సిన సంబంధిత అధికార యంత్రాంగాన్ని కాస్తా తన పచ్చ నోటు గుప్పిట్లో పెట్టుకోగా జీ హుజూర్ అంటూ సదరు అధికారులు వ్యవహరించడం అతిశయోక్తనే చెప్పవచ్చు. దీంతో మహదేవపూర్ మండలంలో ప్రారంభమైన ఆ ఇసుక క్వారీలో మూడు జీరో లారీలు, ఆరు ఓవర్ లోడ్ లారీలంటూ బిజినెస్ వ్యవహారం సాగగా అందులో అందరూ భాగస్వాములైన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

### - తిలా పాపం తలా పిడికెడు

ఇటీవల వర్షాభావ ప్రభావంతో  ఇసుక క్వారీలు మూతపడగా వాటిని దక్కించుకున్న కాంట్రాక్టర్లు వాటి నుండీ లభించే లాభాలు కనుమరుగవడంతో తట్టుకోలేకపోయారు. ఈ క్రమంలో టీజీఎండీసీలోని తనకున్న పలుకుబడితో ఓ కాంట్రాక్టర్ మహదేవపూర్ మండలంలోని ఓ క్వారీని అందరికన్నా ముందుగా  ప్రారంభించుకున్న తీరు అమోఘమనే చెప్పుకోవచ్చు. దీంతో సదరు ఇసుక క్వారీకి సంబంధించి నేనొక్కడినే మెయి0టైన్ చేస్తే సరిపోదని భావించిన సదరు కాంట్రాక్టర్ దారి పొడువు సంబంధిత అధికారులతో కుమ్మక్కయినట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీన తన క్వారీని ఓపెన్ చేయించుకోగా కేవలం తనకు సంబంధించిన లారీలను మాత్రమే లోడ్ చేయించుకుని దర్జాగా వెళ్లడం గమనార్హం. అయితే అక్రమ లారీలకు సంబంధించి కాటారంలోని చెక్ పోస్ట్ కు సమాచారం అందగా వారికి అనుగుణంగా సున్నితంగా వదిలేసినట్లు తెలిసింది.

### - పీవో ఉన్నట్లా లేనట్లా...?

ప్రభుత్వ ఆదాయం పక్కదారి పడకుండా ఉండాలని ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పిస్తుండగా మరో వైపు సంబంధిత అధికారులు మాత్రం ప్రభుత్వ ఆశయాలను నీరుగారుస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 25న మహదేవపూర్ మండలంలోని బెగ్లూర్ క్వారీ ప్రారంభం కాగా అందులో ఎలాంటి వే బ్రిడ్జ్ కాంటా లేకుండానే ఇసుక లోడింగ్ అయిన తీరు పట్ల సర్వత్రా విమర్శలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలోనే సదరు కాంట్రాక్టర్ కు సంబంధించిన 10 లారీలు ఎలాంటి వే బిల్లు లేకుండా ఇసుకను లోడ్ చేసుకుని పోగా సంబంధిత టీజీఎండీసీ యంత్రాంగం కానీయ్యండి మేమున్నాం అనే రీతిలో సపోర్ట్ చేస్తినట్లుగా విశ్వసనీయ సమాచారం. దీంతో సదరు కాంట్రాక్టర్ కు సంబంధించిన ఇసుక దందా శుక్రవారం సైతం జాతీయ రహదారి మీదుగా సజావుగా సాగడం అతని వంతే అయ్యింది.

# సదుపాయాలు అందించడమే లక్ష్యం

- ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములై సహకరించాలి
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- రెడ్డిపురంలో రోడ్డుకు శంకుస్థాపన



అక్షరదర్బార్, హనుమకొండ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని రెడ్డిపురం గ్రామంలో విజయ లక్ష్మి కాలనీ నుంచి సాయి కృప కాలనీ, సాయి కృప కాలనీ నుండి ఎస్సారెస్పీ కెనాల్ వరకు సుమారు రూ.1.50 కోట్ల జీడబ్ల్యూఎంసీ సాధారణ నిధులతో నిర్మించే బీటీ రోడ్డుకు శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రతి పౌరుడికి మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రెడ్డిపురం గ్రామంలోని పలు కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు, డ్రైనేజీ సమస్యకు ఇది శాశ్వత పరిష్కారం అవుతుందని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇలాంటి ప్రాజెక్టులు మరిన్ని తీసుకురావడానికి మీ అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లావుడ్య రవి నాయక్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన సింగ్ లాల్, ఎనుమాముల ఏఎంసీ డైరెక్టర్ రాజు, హన్మకొండ మండల అధ్యక్షుడు మాదాసి అజయ్, డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుట్ట తిరుపతి, విజయలక్ష్మి కాలనీ డెవలప్మెంట్ కమిటీ నాయకులు శృంగారపు భాస్కరాచారి, జవహర్ నాయక్ తో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ సర్టిఫికెట్లతో కొలువు

- ప్రభుత్వ ఉపాధ్యాయుడి నిర్వాకం
- విధుల నుంచి తొలగించిన విద్యాశాఖ

అక్షరదర్బార్, భూపాలపల్లి: నకిలీ సర్టిఫికెట్లతో డీఎస్సీ రాసి, కొలువు సాధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని రాష్ట్ర విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. తెలిసిన కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ పట్టణం మెహర్‌నగర్‌కు చెందిన కృష్ణమాచారి ఏపీలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో బీఎడ్ డిగ్రీ చదివినట్లు నకిలీ సర్టిఫికెట్లు చేయించాడు. 1996 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొలువు సాధించాడు. అప్పటి నుంచి కృష్ణమాచారి అనధికారికంగా విధులకు హాజరవ◌ుతున్నాడు. తాజాగా ఆంధ్ర విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం ధ్రువీకరించింది.  మోసపూరిత ధృవీకరణపత్రం చెల్లదని, ఇలాంటి ప్రవర్తన ఉన్న వారిని ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగనివ్వకూడదని తెలంగాణ విద్యాశాఖ భావించి, శుక్రవారం ఆయన్ను సీఎస్‌సీఏ రూల్స్ 9(x)- 1991 ప్రకారం ఉద్యోగం నుంచి తొలగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెల్లడించారు.

# గణపతి రూపంలో గణపేశ్వరుడు


### - పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ



అక్షరదర్బార్, గణపురం: కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళలో వినాయక చతుర్థి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గణపేశ్వరుడిని గణపతి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి ఏడు వినాయక చతుర్థి నవరాత్రుల్లో స్వామివారిని గణపతి రూపంలో అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పూలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# నాణ్యమైన విద్యనందించాలి

**సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, అక్షరదర్బార్ : రాష్ట్రంలో విద్యా బోధనలో నాణ్యతను పెంచాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు అన్ని విద్యాసంస్థల్లో బోధన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు, బోధన సిబ్బంది హాజరుకు ఫేషియల్ రికగ్నిషన్ తప్పనిసరి చేయాలని సీఎం అన్నారు. దీని ద్వారా హాజరు శాతం పెరగడంతో పాటు ప్రొఫెషనల్ విద్యాసంస్థల్లో లోటుపాట్లు తగ్గుతాయని వివరించారు. విద్యా శాఖ పరిధిలోని అదనపు గదులు, వంటగదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం ఇకపై ఒకే విభాగం (EWIDC) పర్యవేక్షణలో కొనసాగాలని సీఎం ఆదేశించారు. నిర్మాణాల నాణ్యత, నిధుల వినియోగం, పర్యవేక్షణకు ఆ విభాగమే పూర్తి బాధ్యత వహిస్తుందని తెలిపారు. మధ్యాహ్న భోజన బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా తక్షణం చెల్లించాలని సూచించారు. మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కూడా సీఎం ఆదేశించారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిలో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకంపై పరిగణించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పారిశుద్ధ్య బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలల్లో బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ కు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సూచించారు. "విద్యపై ఖర్చు కాదు, పెట్టుబడి చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

# తహసీల్దారు ఇంట అవినీతి పుట్ట

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంచలనం
- ఖిలావరంగల్ తహసీల్దారు నివాసాల్లో ఏసీబీ దాడులు
- ఆదాయానికి మించి ఉన్న ఆస్తులపై సోదాలు
- రూ.5 కోట్ల విలువైన స్థిర, చరాస్తుల పత్రాలు స్వాధీనం
- దాడులతో రెవెన్యూశాఖలో ఒక్కసారిగా కలకలం
- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర అధికారుల గుండెల్లో రైళ్లు



**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

ఆదాయానికి మించి అక్రమాస్తుల కేసులో తహసీల్దారు అక్రమాలు బయటపడ్డాయి. ఒకటి కాదు రెండు కాదు.. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రైడ్స్‌లో కొన్ని రూ.కోట్ల విలువైన అక్రమాస్తులు బయటపడ్డాయి. కొన్నేళ్లుగా సదరు తహసీల్దారుపై నివురు గప్పిన నిప్పులా అవినీతి ఆరోపణలు ఉండగా, వాటిని పటాపంచలు చేస్తూ.. ఏసీబీ అధికారులు అక్రమ లెక్కలు తేల్చారు. ఏకకాలంలో అనేకచోట్ల దాడులు నిర్వహించి అక్రమాస్తులు, భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ తహసీల్దారు ఇళ్లలో దాడులు నిర్వహించడంతో, ఇలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నట్లు తెలుస్తున్నది.

**- పక్కా సమాచారంతో..**

ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పరిధిలోని ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వరరావు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు శుక్రవారం మెరుపుదాడులు చేశారు. హనుమకొండ లోని ఆయన నివాసంతో పాటు సొంతూరైన ఖమ్మంలో ఏకకాలంలో సోదాలు జరిపారు. దాడుల్లో రూ. 1.15 కోట్ల విలువైన ఏడు స్థిరాస్తులు, రూ. 1.42 లక్షల విలువైన 17 ఎకరాల భూమి, 10 గుంటల వ్యవసాయ భూమి, రూ. 23.84 లక్షల విలువైన 70 తులాల బంగారు ఆభరణాలు, రూ. 92,000 విలువైన 1.791 గ్రాముల వెండి వస్తువులు, రూ. 34.78 లక్షల విలువైన రెండు ఫోర్-వీలర్లు, ఒక టూ-వీలర్, రూ. 3.28 లక్షల విలువైన 23 గడియారాలు, రూ. 16.43 లక్షల విలువైన ఇతర గృహోపకరణాలు పట్టుకున్నారు. వీటన్నింటి విలువ సుమారు రూ. 5.02 కోట్లకుపైగా ఉంటుందని ఏసీబీ అధికారులు తెలిపారు. మార్కెట్ విలువ ప్రస్తుత ప్రభుత్వ విలువ అంతకంటే, ఎక్కువగా కూడా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా తహసీల్దార్ బండి నాగేశ్వరరావును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి, స్పెషల్ జడ్జ్ ముందు హాజరుపరిచారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయవచ్చని ఏసీబీ కోరింది. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొంది. వాట్సప్ నంబర్ 94404 46106 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది.

**- సంచలనం**

**ఏసీబీ అధికారులు తహసిల్దారు బండి నాగేశ్వరరావు నివాసాల్లో ఏకకాలంలో సోదాల జరిపి ఆదాయానికి మించి ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకోవడం ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంచలనం కలిగించింది. బండి నాగేశ్వర్ రావు తహసిల్దారుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కీలకమైన వివిధ మండలాల్లో పనిచేశారు. హనుమకొండ జిల్లాలో కమలాపురం, ధర్మసాగర్, కాజీపేట, హసన్ పర్తి మండలాల్లో తహసీల్దారుగా పనిచేసిన నాగేశ్వర్ రావు ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఖిలావరంగల్ తహసిల్దారుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఖిలా వరంగల్ మండలానికి రావడానికి ముందు బండి నాగేశ్వర్ రావుపై హసన్ పర్తి, కాజీపేట మండలాల్లో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు తహసిల్దార్ బండి నాగేశ్వర్ రావు పై దృష్టి సారించినట్లు సమాచారం. ఆయన ఆదాయానికి మించి ఉన్నట్లు ఆస్తుల చిట్టాను గుర్తించిన తర్వాత ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడులకు దిగినట్లు తెలిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బండి నాగేశ్వర్ రావుతో పాటు మరికొందరు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులపై దృష్టి నజర్ పెట్టిన ఏసీబీ అధికారులు తాజాగా బండి నాగేశ్వర్ రావు నివాసాల్లో దాడులు జరపటం రెవెన్యూ శాఖలో కలకలం రేపింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసిల్దార్ల జాబితాలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే వీరిలో కొందరికి సంబంధించిన సమాచారాన్ని ఏసీబీ సేకరించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.**




# పారదర్శకమైన పాలన కోసమే స.హ.చట్టం

**- సమాచార హక్కు చట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్ రావు**

అక్షరదర్బార్, వరంగల్: ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం 2005పై రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో పిఐఓ, అపిలెట్ అధికారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర సమాచార కమిషనర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్ లు పూల మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

అనంతరం రాష్ట్ర సమాచార కమిషనర్లు పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో వారు మొక్కలు నాటారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఇందులోని అంశాలపై అధికారులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు తక్కువ అందిన జిల్లాల్లో వరంగల్ జిల్లా ఒకటన్నారు. పీఐవో అధికారులు ప్రజలకు సకాలంలో పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా, చట్టంలో ఉన్న సమయపరిమితి లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాల నుండి 17వేల ఆర్టిఐ కేసులు పెండింగ్ లో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాల పర్యటనలు చేపట్టి కేసులను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతోందని అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యేలా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఆర్టిఐ యాక్ట్ లో 31 సెక్షన్లు 6 చాప్టర్లు ఉన్నాయని, సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, డీఆర్ ఓ విజయ లక్ష్మి, ఆర్డీఓలు, వివిధ శాఖల పీఐఓలు, అప్పీలెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇది యూరియా విపత్తి!



అక్షరదర్బార్, పర్వతగిరి: ఆ రైతు పత్తి పంటను దక్కించుకునేందుకు రోజులకు రోజులు యూరియా కేంద్రాలు, పీఏసీఎస్‌ల చుట్టూ తిరిగాడు. అయినా.. యూరియా దొరకలేదు. ఒక్క బస్తా అయినా యూరియా దొరకలేదు. దీంతో నిరాశ చెందాడు. విసిగి వేసారి చివరకు వేసిన పంటను కుటుంబ సభ్యులతో కలిసి తొలగిస్తూ ఇలా కనిపించాడు. రైతు పేరు భూక్యా బాలు. ఊరు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఉట్టితండా. ఈ చిత్రం రైతుల దైన్యస్థితికి దర్పణం.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915